# ఆగు చూడు నడు

వెంకటేశ్వర్లు చిరాకుమనిషి.

అతనికి విసుగుదల ఎక్కువ. పని గంటల్లో ఎక్కువ భాగం అతని మొహం మునమునలాడుతూనే వుంటుంది. ఎప్పుడూ ఎవరో వొకర్ని పిలిచి కొరకొర చూస్తూ, నాలుగు చురకలేసి పంపిస్తూ వుంటాడు.

ఈ సంగతి మా అందరికీ తెలియనిది కాదు.

అందుకే రాజేశ్వర్రావ్ అంటూ వుంటాడు, "ఆయన మొహంచూస్తే ఎప్పుడూ తుమ్మల్లో పొద్దుపొడిచినట్లే వుంటుంది" అని.

చంద్రమౌళి అయితే, మరో అడుగు ముందుకువేసి, నిష్ఠూరంగా కోపగించుకుంటాడు కూడా. "మీరు ఆయనకి చికిత్స చేయించరు. ఆయన బాగుపడటం మీకు ఇష్టంలేదు. ఆయన ఆరోగ్యంగా వుంటే, నిజానికి మీకు ఆఫీసులో ఆనందం కరువౌతుంది" అని అతను వన్సొక్కణ్ణే దుయ్యపడుతూ వుంటాడు—వెంకటేశ్వర్లు బాధ్యత అంతా నా నెత్తినే వున్నట్టు.

ఇలా సాగుతున్న మామూలు కథకి— మా సీతాపతి, పెద్ద మలుపొచ్చిందని చెప్పినప్పుడు—నేను విస్తుపోయాను.

శనివారం—

ఒక గంట ఆలశ్యంగా ఆఫీసుకు చేరుకున్నాను.

పర్మిషన్ స్లిప్ రాసి పంపించి నా సీట్లో కూర్చున్నాను.

వసుంధర చెప్పిన మాటల్ని నెమరువేసుకుంటూ సీతాపతి సీటుకేసి చూసేను.

అతను లేడు.

టేబుల్ తాళం తీస్తూ ప్యూన్ రంగయ్యని అడిగేను, " సీతాపతి రాలేదా ? "

"వచ్చేరండీ. మేనేజర్ రూమ్‌లోకి వెళ్ళారు" చెప్పేడు.

నేను నా పనిలో పడ్డాను.

మనస్సు మాత్రం వసుంధర ఉదయంనుంచీ సతాయించిన విషయాన్ని గురించే ఆలోచించసాగింది. భార్యగా మంచి అధికారంతో కూడిన హెచ్చరికనే చేసి పంపింది, వసుంధర. తను చెప్పిన వ్యవహారం గురించి పూర్తి వివరాలు కనుక్కొని రావలసిందేనని గోముగా ; చిరుకోపంగా, కర్కశంగా, నిష్కర్షగా చెప్పింది.

సిగరెట్ వెలిగించుకుంటూ తలెత్తి చూశాను.

సీతాపతి కేబిన్‌లోనుంచీ బయటికి వచ్చాడు. చేతిలో ఫైలుని టేబుల్‌మీద పెట్టి సీట్లో కూర్చున్నాడు.

నెమ్మదిగా లేచి అతని సీటుదాకా వెళ్ళాను. స్టూలుమీద కూర్చున్నాను.

నా రాకని గమనించాడు సీతాపతి.

మొహం పక్కకి తిప్పుకుంటూ కళవళపడ్డాడు.

రుమాలు తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

నేను గతుక్కుమన్నాను !

విషయం అర్థమైంది. ఏవో అక్షింతలు పడ్డాయన్నమాట.

నేను పరీక్షగా మళ్ళీ సీతాపతికేసి చూశాను.

తలవంచుకుని ఫైల్లోని కాగితాన్ని తిరగేయసాగేడు.

పగిలిన గొంతుతో " చెప్పండి " అన్నాడు.

" వెంకటేశ్వర్లు ఏఁవంటాడు ? " అడిగేను.

సీతాపతి మొహం పైకెత్తి నావైపు చూశాడు. అతని కనుకొలకుల్లో యింకా చెమ్మ వుంది.

" ఆయన వేధింపు ఎక్కువైంది. భరించలేకుండా వున్నాను. " నెమ్మదిగా అన్నాడు.

" అయితే వోసారి యూనియన్ వాళ్ళకి చెప్తే సరి. వాళ్ళే చూసుకుంటారు. "

సీతాపతి అదోలా నవ్వేడు. " మంచి సలహానే మీది ! మీరు నన్ను పెనంమీంచీ పొయ్యిలోకి తోసేట్టున్నారు" అన్నాడు.

నేను సాలోచనగా అతనికేసి చూసేను.

క్షణాలు నిశ్శబ్దంలో గడిచేయి.

"ఇంతకీ అసలు విషయమేఁవిటీ" నేనే మళ్ళీ ప్రశ్నించేను.

కొద్దిసేపు తటపటాయించేడు సీతాపతి.

రుమాలుతో మొహమంతా తుడుచుకున్నాడు. "నా కంటే పెద్దవారు మీరు. నా శ్రేయోభిలాషులు. మీకు చెప్పుకుంటే కొంత బాధ తగ్గుతుంది" అని నా కళ్ళల్లోకి చూస్తూ, "సాయంత్రం మా యింటికి వెళ్దాం. అక్కడే మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

అలాగేనన్నట్టు తల వూపేను నేను.

టౌన్‌కు దూరంగా ఎక్కడో చిలకలపూడిలో సీతాపతి ఇల్లు. ముగ్గు అంచులమీద గొబ్బెమ్మల్ని వుంచినట్లు అక్కడోటి ఇక్కడోటి ఇళ్ళు !

సీతాపతి ఇల్లు పాడుబడిన మండువా లోగిలి వెలవెలబోతూ వుంది—ఊరి పొలిమేరలో వొంటరి తాటిచెట్టులా వుంది.

నన్ను లోవసారాలో కూర్చోబెట్టి, సైకిల్ని ఆ వసారాకి మరో మూలగా నిలబెట్టి లోపలికి వెళ్ళాడు ; సీతాపతి.

బ్రిటిష్‌వాళ్ళ కాలంనాటి నాలుగు కాళ్ళ మేజాబల్ల వొకటి నా ముందుంది. దానిమీద పేపర్.

నేను పేపర్‌ని చాలాసార్లు చదివేశాను. తీరా చూస్తే అది ఆరు రోజుల నాటిది. చుట్టూ చూస్తూ నిశ్శబ్దాన్ని భరిస్తున్నాను.

చేతిలో ప్లేటూ, మంచినీళ్ళ గ్లాసుతో బయటపడ్డాడు సీతాపతి. నా ముందుంచి " తీసుకోండి, మాష్టారూ " అన్నాడు.

" మరి నీ కో " అడిగేను.

" నాది అయింది లెండి. మీరు కానివ్వండి "

" ఏఁవిటీ—నన్నిక్కడ కూర్చోబెట్టి నువ్ లోపల లాగించేశావన్నమాట. చాలా అన్యాయం సీతాపతీ "

ఇద్దరమూ నవ్వుకున్నాం. " అదేం కాదులెండి. నేను పొద్దున భోజనంతోనే ముగించాను. మీరు తీసుకోండి. " చెప్పాడు.

ప్లేటులో నల్ల హల్వా, బందరు లడ్డు, బూంది వున్నై. నేను తినసాగేను.

" మన కిద్దరికీ పరిచయమై చాలా కాలమైనా మీ రెప్పుడూ మా యింటికి రాలేదు. "

" నువ్వూ అంతే కదా. నిజానికి ఇవ్వాళ నేనే నిన్ను మా యింటికి ఆహ్వానిద్దామనుకున్నాను. కానీ, ఆ అవకాశాన్ని ముందుగా నువ్ కొట్టేశావ్ " అన్నాను.

సీతాపతి కొద్దిసేపు మౌనం వహించాడు.

లౌకిక మర్యాదలు మరచి, మనసు విప్పి ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు సీతాపతి. అతని వాలకం చూస్తే నా కట్టా అనిపించింది. కానీ, మాటలు మారాం చేస్తున్నట్టున్నై. ఆదోవిధమైన మానసిక ఘర్షణని అనుభవిస్తున్నాడు.

C. P. BROWN MEMORIAL
LIBRARY, CUDDAPAH.
Acc. No. 394



పెదవులు బిగించీ విడిచీ చిత్రంగా తలని విదిలిస్తున్నాడు. కుడిచేతి ఐదు వేళ్ళనీ ఒక వరుసలా మూసి, దానికి వ్యతిరేకమైన వరుసలో విడుస్తూ కూర్చున్నాడు.

నిముషాలు గడుస్తున్నై.

నేను తినడం పూర్తిచేసి, నీళ్ళు తాగేను.

సీతాపతి మొదలెట్టేడు.

"మీకు తెలుసో తెలీదో—నాకు భార్య పోయింది." అతని గొంతు బొంగురుపోయింది. నేను నొచ్చుకున్నాను. ఇక్కడ మొదలెట్టేడేమా అని ఆశ్చర్యపోయాను. నా జవాబు కోసం చూడకుండా చెప్పసాగేడు.

"వెంకటేశ్వర్లు ఆర్నెల్ల క్రితం నన్ను పిలిచి తన చెల్లెల్ని పెళ్ళిచేసుకోమని అడిగేడు. ఆమె ఎమ్మేచేసి టీచర్‌గా పనిచేస్తోంది. ఒక కాలుకి అవిటితనం వుందనీ చెప్పేడు. నే నాయన కోరికకి సుముఖంగా లేనని, నా నిరుత్సాహం ద్వారా గమనించాడు. అప్పట్నుంచీ అయినదానికీ కానిదానికీ నామీద విరుచుకుపడుతున్నాడు."

విషయం సమస్తం అవగతమయింది నాకు.

ఆఫీసు విషయాల గురించి—సిబ్బందిమీద విసుగూ, చిరాకూ ప్రదర్శించి, చీటికీ మాటికీ చురకలేస్తాడనుకున్న వెంకటేశ్వర్లు—మరో ఆకు ఎక్కువే చదివేడన్న సంగతి తెలిసినప్పుడే—నేను ఈ మామూలు కథకి మలుపొచ్చిందని విస్తుపోయాను!

"ఇదేమైనా సబబుగా వుందా ?" అని సూటిగా నన్ను ప్రశ్నించాడు, సీతాపతి. ఆ వెంటనే అన్నాడు, "ఇవ్వాళ పొద్దున్న ఆఫీసుకు రాగానే లోపలికి పిలిచి ; ఏదో రిపోర్ట్ వంకపెట్టి సూటీ పోటీ మాటలు మాట్లాడి ఎంత మాటన్నాడో తెలుసా మాష్టారూ !"

సాలోచనగా, సానునయంగా సీతాపతికేసి చూసేను, ఏమన్నాడో చెప్పమన్నట్టు.

"ఆఫీస్ వర్క్‌లో ఇనెఫిషెంట్‌వని ఋజువౌతూనే వుంది రోజూ. నే నడిగిన ప్రశ్నకి ఆర్నెల్లనుంచీ సమాధానం చెప్పకపోవడం చూస్తే మరోలా అనుమానించాల్సి వస్తోంది అంటూ ఏవేవో..."

సీతాపతి చెప్పటం ఆపి తలవంచుకున్నాడు.

"సంస్కారం అంతలో వుందన్నమాట. బాధపడకు. అసలు ఆ వెంటనే నాలుగూ దులిపేస్తే బాగుండేది." కోపంగా అన్నాను.

"అవును. నేనూ ఆ స్థితిలోనే వున్నాను. కానీ, తమాయించుకున్నాను."

ఆగి, పెద్దగా నిట్టూర్చేడు, సీతాపతి.

"నేను చాలా ఇబ్బందుల్లో వున్నాను మూర్తిగారూ. వెంకటేశ్వర్లుతో పేచీపడి, అతన్ని నాలుగు మాటలూ అని నెగ్గుకు రాగల స్థితిలో లేను. అందుకని, నా బాధను నేను దిగమింగుకో వలసి వస్తోంది." గాద్గదికంగా చెప్తున్నాడు, సీతాపతి.

ఆఫీసులో సీతాపతి కళ్లల్లో తిరిగిన నీటికి కారణం వుందన్నమాట !

" నన్ను పార్వతీపురంకి బదిలీ చేస్తానని బెదిరిస్తున్నాడు. మామూలుగా ఇలాంటి బెదిరింపులకి బెంబేలుపడే మనిషిని కాకపోయినా, ఇప్పటి స్థితి వేరు. రాధ మరణంతో నే నా నడుం విరిగింది. మా లత ఇప్పుడు మునిసిపల్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది. నాకు ట్రాన్స్‌ఫర్ అయితే, ఆమెకు పెద్ద సమస్య... "

" లత అంటే ?—" అడిగేను.

" మా అమ్మాయి. మీకు తెలీదు గదూ " అని అతనేదో చెప్పేంతలోనే, కాఫీ తీసుకుని వచ్చింది లత.

" ఇదిగో. మాటలో నే వచ్చింది. ఈమే లత. మా పెద్దమ్మాయి. " కాఫీని స్టూల్‌మీద వుంచి, నమస్కారం చేసింది లత. సన్నగా శలాకలా వుంది. మొహం పచ్చగా కళగా వుంది.

లత లోపలికి వెళ్ళింది. సీతాపతి మళ్ళీ మొదలెట్టేడు, " నాకు నలభై నాలుగు—ఇప్పుడు. లత వయస్సు ఇరవై రెండు. నాది ఎర్లీ మేరేజ్, లత తర్వాత అన్నపూర్ణ వుంది. బియ్యేస్సీ చదువుతోంది. నీకేమంత వయస్సు మీరి పోలేదు, పెళ్ళిచేసుకో మంటాడు, వెంకటేశ్వర్లు. ఊళ్లో మరికొందరు తెలిసినవాళ్ళూ ఇదే పాట. మీరు చెప్పండి. ఎదిగిన పిల్లలు ఇద్దర్ని ఇంట్లో పెట్టుకుని, వాళ్ల బాధ్యతల్ని విస్మరించి నేను మళ్ళీ తలంబ్రాలకి తలవంచటం భావ్యమేనా ? "

ఎందుకో నాకు గుండె బిగపట్టినట్లయింది. కొయ్యబారి పోయాను. లత తండ్రి మాటలు విన్నది.

స్తబ్ధతలో నడిచి వెళ్తున్నట్టు నెమ్మదిగా కదిలి, లోపలికి వెళ్ళింది.

" నా ఇష్టా యిష్టాల ప్రమేయం లేకుండా నామీద ఆశ పెంచుకుని, కక్ష కట్టటం, వెంకటేశ్వర్లుగారిలాంటి మనిషికి సబబేనా చెప్పండి "

సీతాపతికి నేనేం జవాబివ్వగలను ? వెన్నులో పోటు ప్రారంభమైంది నాకు. వసుంధర మాటలు గుర్తుకొచ్చినై. " బంగారంలాంటి మనిషిట మీ సీతాపతి. ఎలాగోలా మాట్లాడి మా చెల్లెలికి కుదర్చండి "

వెంకటేశ్వర్లు గురించి నేనేం అభిప్రాయం చెప్పగలను ? దొంగకు తేలుకుట్టే ఏడుపుకు ఆస్కారం ఏది ?

" ఇదంతా పోనీండిగానీ మూర్తిగారూ, వెంకటేశ్వర్లు ఈరోజు నన్ను ఇలా బాధించడమే నా గుండెల్ని మండిస్తోంది. " అని కనుబొమలు ఎత్తి వో క్షణం చూసి అన్నాడు, " అన్నట్టు మీకు చెప్పలేదు కదూ—ఇవ్వాళ మా మేరేజ్‌డే. ఆం. ఇటు చూడండి. నా రాధ కూడా ఇక్కడే వుంది. " అంటూ జేబులో నుంచీ పర్సు తీసి, తెరిచి ఫొటోని నా ముందుంచేడు.

" రాధతో పాతికేళ్ళు అమృతంలో తడిశాను. తెలిసి తెలిసి ఇప్పుడు త్రోవలో అగ్గికణాల్ని పరచుకోలేను. "

—సీతాపతి భావావేశంతో ఏమో చెప్తున్నాడుగానీ, నా మనస్సుకు పట్టడంలేదు.

లత కళ్ళముందు మెదిలింది.

చూడకపోయినా, రాధ ఫోటో ఆధారంగా అన్నపూర్ణ రూపాన్ని ఊహించుకుంది— మనస్సు.

వసుంధరకు సమాధానం—లత !

వెంకటేశ్వర్లుకి చికిత్స—అన్నపూర్ణ !

నా ఆలోచనలో వెంకటేశ్వర్లు కూతురూ మెరిసింది !

ఊపిరి తెచ్చుకుని లేచి నిలబడ్డాను. గబగబా అడుగులు వేస్తూ బయటికి వచ్చేను.

అవును. అడుసు తొక్కకుండానే కాలు కడుక్కోవలసిన అవసరం నా నడక వేగాన్ని పెంచింది ! !

$0_0 0$